## సెయింట్ జార్జ్ స్కూల్ లో బోనాల వేడుకలు




**శెనార్తిమీడియా, కరీంనగర్ :** కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారి, పోతరాజు వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పాఠశాల ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంతో కళకళలాడేలా చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని జగన్మాతగా భావిస్తూ ఆషాఢ మాసంలో భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించే సంప్రదాయం ఎంతో విశిష్టమైందన్నారు. కార్యక్రమంలో ఆయా స్కూళ్ల ప్రిన్సిపాల్స్, టీచర్స్ పాల్గొన్నారు.

## విజన్ హైస్కూల్ లో గోరింటాకు సంబరాలు




**శెనార్తిమీడియా, కరీంనగర్ :** కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో గోరింటాకు సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో తెలంగాణలోని ఆడపడుచులందరూ గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయమని అన్నారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని చేతులపై గోరింటాకుతో వివిధ రకాల డిజైన్లు వేసుకున్నారు. బెస్ట్ డిజైన్ వేసిన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, ఇంచార్జ్ ప్రతిభ భారతి, టీచర్స్ పాల్గొన్నారు.

## స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని జేసీఎం ఫంక్షన్ హాల్ ఎదురుగా స్కూటీ అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామానికి చెందిన భూక్యా రాములు (55) నర్సంపేటలో నివసిస్తున్న తన కుమార్తె ఇంటికి స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడి కనుబొమ్మ, కుడి మోకాలు, కుడి చేతి మణికట్టు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. దీంతో ఈఎంటీ గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ మత్తి గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అంబులెన్స్‌లో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.

## సర్పంచులతో సమీక్ష సమావేశం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనిత తెలిపారు. ఉదయం 11:30 గంటలకు మండలంలోని సర్పంచులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, ఇతర పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మైనర్‌పై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు




**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన బోజ్జ కనకయ్య అనే వ్యక్తిపై మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదు చేసినట్లు శంకరపట్నం ఎస్ ఐ తెలిపారు. బాలిక అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ ఐ వెల్లడించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం..

### ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎన్‌పీడీసీఎల్ అధికారులకు కార్పొరేటర్ విజయ మల్లేష్ కృతజ్ఞతలు



**శెనార్తి మీడియా రామగుండం ఆగస్టు 1:** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీ, లంబాడి కాలనీలలో విద్యుత్ స్తంభాల కొరత కారణంగా నెలకొన్న వీధి దీపాల సమస్యకు పరిష్కారం లభించింది. గతంలో విద్యుత్ స్తంభాలను దూరదూరంగా ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విషపురుగులు ఇళ్లలోకి వస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారని 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తెలిపారు.

ఈ సమస్యను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే ఎన్‌పీడీసీఎల్ అధికారులతో మాట్లాడి అవసరమైన చోట మధ్యలో అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దీంతో శనివారం కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆధ్వర్యంలో, ఎన్‌పీడీసీఎల్ లైన్‌మెన్ పూర్ణచందర్ పర్యవేక్షణలో ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీ, లంబాడి కాలనీలలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌తో పాటు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ, ఏడీఈ, ఏఈ మరియు విద్యుత్ శాఖ సిబ్బందికి 1వ డివిజన్ ప్రజల తరఫున కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ సిబ్బందితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** ఎల్‌నినో ప్రభావంతో ఈ వానాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. ముత్తారం, చింతగుట్ట, కేశవపట్నం, మొలంగూరు, మెట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన రైతు అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలైన పెసర, మినుము, వేరుశనగ, కంది, మక్కజొన్న పంటలను సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. భూగర్భ జలాలు, సాగునీటి వనరులు సమృద్ధిగా ఉన్నప్పుడే వరి సాగు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించేందుకు ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసుకొని వినియోగించుకోవాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు సునంద, ఆరతి, కీర్తన, తిరుపతి, స్రవంతి పాల్గొని పంటల ఎంపిక, సాగు యాజమాన్య పద్ధతులు, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన 'తేజస్' విద్యార్థులు




**శెనార్తిమీడియా, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొత్తపల్లి పట్టణంలోని తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాలలో పతకాలు సాధించినట్లు కాలేజీ చైర్మన్ సీహెచ్.సతీష్ రావు తెలిపారు. అండర్–18 జావెలిన్ త్రోలో సీహెచ్.భీమేష్ ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో జి.రేవంత్, 200 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్.అభిషేక్ తృతీయ స్థానం, 1000 మీటర్ల పరుగు పందెంలో బి.సిద్ధు తృతీయ స్థానం, షార్ట్‌పుట్‌లో బి.నాగరాజు ప్రథమ, జె.సాయికృష్ణ ద్వితీయ, డిస్కస్ త్రోలో బి.నాగరాజు ద్వితీయ, జె.సాయికృష్ణ తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఆగస్టు 7న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ జిల్లా తరఫున ఆడుతారని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన



**శెనార్తి మీడియా, హుజురాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సిర్సపల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి పొద్దుటూరి సతీష్ రెడ్డి సూచించారు. హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర, మినుము, కంది, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని వివరించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అందిస్తున్న శాస్త్రీయ సూచనల మేరకు పంటల యాజమాన్యాన్ని చేపట్టాలని కోరారు. రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే "రైతు నేస్తం" కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ నిపుణుల సలహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను అనుసరించాలని సర్పంచ్ పోల్సాని రామారావు కోరారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ విధానాలతో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్, ఉప సర్పంచ్ జనగామ రాజేష్ కుమార్, కరోబార్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి నెల రక్తదాన శిబిరాలు

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

రాష్ట్రంలో రక్త కొరతను అధిగమించి అత్యవసర పరిస్థితుల్లో ఎవరికీ రక్తం కోసం ఇబ్బందులు ఎదురుకాకుండా చేయాలనే లక్ష్యంతో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి నెల రెండో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంక్‌లలో "శ్రీనివాస మిత్రుల స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు" నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి తెలిపారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు, క్యాన్సర్, థలసేమియా వంటి వ్యాధుల చికిత్సలో రక్తం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో లేక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తే ఈ సమస్యను అధిగమించవచ్చని అన్నారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీనివాస మిత్రుల స్వచ్ఛంద రక్తదాన మహాయజ్ఞం" ద్వారా ఇప్పటికే 2,650 మందికి పైగా స్వచ్ఛంద రక్తదాతలు రక్తదానం చేసి అవసరమైన రోగులకు సహాయపడినట్లు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచ రికార్డు నమోదవడం సంస్థ సేవాభావానికి నిదర్శనమని చెప్పారు. రక్తదానం వల్ల ఆరోగ్యవంతులకు ఎలాంటి హాని ఉండదని, వైద్యుల పర్యవేక్షణలో 15 నుంచి 20 నిమిషాల్లో 350 నుంచి 450 మిల్లీలీటర్ల రక్తాన్ని దానం చేయవచ్చని వివరించారు. దానం చేసిన రక్తాన్ని శరీరం కొద్ది రోజుల్లోనే తిరిగి ఉత్పత్తి చేసుకుంటుందని తెలిపారు. ప్రతి మండలంలో స్వచ్ఛంద రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే రక్తం అందించే వ్యవస్థను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. యువత, విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యులు, వ్యాపారవేత్తలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది ఒక ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్న శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి, ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం ఒకసారి అయినా స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ప్రతి నెల రెండో శనివారం నిర్వహించే రక్తదాన శిబిరాల్లో పాల్గొని తెలంగాణను రక్త కొరతలేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు



## స్వేచ్ఛ అంటే ఇష్టానుసారంగా వ్యవహరించడం కాదు

### జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్

**శెనార్తి మీడియా, ముంబై:** : యువత స్వేచ్ఛను బాధ్యతతో వినియోగించుకోవాలని, స్వేచ్ఛ అంటే నచ్చినట్లు ప్రవర్తించడం కాదని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ అన్నారు. లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత ఆశయాల కంటే దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం భారత్ అభివృద్ధికి కీలకమైన అవకాశాల దశలో ఉందని, దేశ నిర్మాణంలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. దేశం, నాయకత్వం, తమపై విశ్వాసంతో ముందుకు సాగుతూ జాతీయ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

